సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

7

బుధవారం । 11 । జూన్ । 2025

ప్రథమ వర్ధంతి



కీ॥ శే॥ శ్రీ చింతా పాండురంగారెడ్డి గారు

జననం : 18-06-1951

మరణం : 11-06-2024

వ్యవస్థాపకులు : శ్రీ మురళీ మోహన బాయిల్డ్ & రా రైస్‌మిల్ ప్రైవేట్ లిమిటెడ్

మీ విలువలనే గుండెల్లో అల్లుకొని, మీరు నింపిన ధైర్యమే ఊపిరిగా...
మీరు చూపిన పట్టుదలే ప్రాణంగా.. మీరు నేర్పిన ముందుచూపే స్ఫూర్తిగా...
మీ ఆచరణే మాకు ఆదర్శం.. మీ నడవడికే మాకు మార్గదర్శకం..
మీ విలువలే మాకు ఆశయం.. మీరు చూపిన బాటలోనే పయనిస్తూ...
మీరు శివైక్యం పొంది సంవత్సరకాలమైనా...
మీరు మాతో గడిపిన జ్ఞాపకాలను సదా స్మరించుకుంటూ... అంజలి ఘటిస్తూ...

కుటుంబసభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు మరియు సిబ్బంది

శ్రీ మురళీ మోహన బాయిల్డ్ & రా రైస్‌మిల్ ప్రైవేట్ లిమిటెడ్

కొమరిపాలెం, బిక్కవోలు మండలం. తూర్పుగోదావరి జిల్లా. ఫోన్: 08857-235326, 235026

క్లుప్తంగా

మహిళల రక్షణలో ప్రభుత్వం విఫలం

- ఏడాది కాలంలో 188 అమానుష ఘటనలు
- మాజీ ఎంపీ చింతా అనురాధ


మాజీ ఎంపీ చింతా అనురాధ

అల్లవరం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు మహిళల రక్షణ విషయంలో పూర్తిగా విఫలమైందని, ఏడాది కాలంలో ఆడబిడ్డలపై 188 దారుణాలు చోటు చేసుకున్నా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చర్యలు తీసుకోకపోవడం దారుణమని మాజీ ఎంపీ చింతా అనురాధ మంగళవారం ఓ ప్రకటనలో విమర్శించారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజల దృష్టిని మరల్చేందుకు కూటమి నాయకులు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని పేర్కొన్నారు. పాలనపై కన్నా రెడ్‌బుక్ రాజ్యాంగంపై శ్రద్ధ చూపుతున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశ్నించిన వారిపై కేసులు బనాయించి జైల్లో పెడుతూ రెడ్ బుక్‌ని ఫాలోఅవుతున్నారని ఎద్దేవా చేశారు. అనంతపురంలో తన్మయి హత్యకు గురి కాగా, పశ్చిమగోదావరి జిల్లాలో ఎనిమిదేళ్ల బాలికపై అధికార పార్టీకి చెందిన వ్యక్తి అత్యాచారం చేస్తే కనీసం పరామర్శించడానికి తీరిక లేదన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిట్టడానికే కూటమి నాయకులు, హోంమంత్రి అత్యుత్సాహం చూపుతున్నారన్నారు. రాష్ట్రంలో మహిళలు, చిన్నారుల పట్ల జరుగుతున్న ఆరాచకాలను ఆపి, బాధితులకు అండగా నిలబడాలని, వారి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వైఎస్సార్ సీపీ నాయకత్వంలో పోరాటాలను ఉధృతం చేస్తామని మాజీ ఎంపీ అనురాధ హెచ్చరించారు.

పత్రికా కార్యాలయాలపై దాడులు ప్రజాస్వామ్యానికి ప్రమాదం

సాక్షి కార్యాలయాలపై దాడులకు ఏపీ యూడబ్ల్యూజే జిల్లా శాఖ అధ్యక్షుడు బాబీ ఖండన



అమలాపురం టౌన్: రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సాక్షి పత్రికా కార్యాలయాలపై అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు దాడులు చేయడాన్ని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) జిల్లా శాఖ అధ్యక్షుడు మండేల బాబి ఖండించారు. ఈ మేరకు బాబి అమలాపురంలో మీడియాతో మాట్లాడారు. పత్రికా కార్యాలయాలపై దాడులు చేసే సంస్కృతి పత్రికా స్వేచ్ఛకు, ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని ఆయన పేర్కొన్నారు. సాక్షి కార్యాలయాలపై దాడులు చేసి బోర్డులపై సాక్షి అక్షరాలను తొలగించడం, పత్రికా ప్రతులను దగ్ధం చేయడం వంటి చర్యలకు పాల్పడడం దిగ్భ్రాంతి కలిగించిందన్నారు. టీవీలో డిబేట్‌పై పలుచోట్ల పోలీసు కేసులు నమోదయ్యాయని, వాటిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్న క్రమంలో అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు సాక్షి కార్యాలయాలపై దాడులకు పూనుకోవడం మంచి పద్ధతి కాదని బాబి అభిప్రాయపడ్డారు.

అక్షరంపై కక్ష కట్టి..

'సత్యమేవ జయతే' హితోక్తిని మకుటంలో ధరించి.. ఆ మాటలను త్రికరణ శుద్ధిగా నమ్మి.. ప్రభుత్వ విధానాల్లోని దుర్నీతిని ఎండగడుతూ.. నిరంతరం జనపక్షం వహిస్తూ.. ప్రజలకు నిత్యసత్యాలను అందిస్తున్న 'సాక్షి' అక్షరంపై పాలకులు కక్ష కట్టారు. సాకు కోసం వేచి చూసి.. మూకదాడికి 'కూటమి' కట్టారు. అణగారిన ప్రజల మనస్సాక్షిగా నిలుస్తున్న పత్రిక కార్యాలయంపై తెగబడ్డారు. పత్రిక నేమ్‌బోర్డును బలవంతంగా పెకలించి, ధ్వంసం చేశారు. భయానక వాతావరణాన్ని సృష్టించేందుకు ప్రయత్నించారు. ఆ మూకల బరితెగింపు చూసి అటుగా వెళ్తున్న సామాన్య ప్రజలు నివ్వెరపోయారు. చక్కటి పాలన అందించాలని అందలం ఎక్కిస్తే.. ఇలా అరాచకానికి పాల్పడటమేమిటంటూ నిర్ఘాంతపోయారు.

- నిజాలు చెబుతున్న 'సాక్షి'పై అక్కసు
- దాడికి 'కూటమి' కట్టారు
- రాజానగరంలోని పత్రికా కార్యాలయం వద్ద ఆందోళన
- మూకుమ్మడి దాడి
- అనపర్తి ఎమ్మెల్యే ఆధ్వర్యాన చెలరేగిపోయిన మూకలు
- సాక్షి నేమ్ బోర్డు పీకేసి.. పత్రికల దహనం
- అడ్డుకోబోయిన పోలీసులకు గాయాలు



సాక్షి కార్యాలయం ముందు బైఠాయించిన ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కూటమి శ్రేణులు


కూటమి శ్రేణుల దుశ్చర్యతో దహనమవుతున్న సాక్షి దినపత్రికలు

రాజానగరం: 'సాక్షి' టీవీలో ఇటీవల జరిగిన ఒక చర్చాగోష్ఠిలో అమరావతి మహిళలను కించపరిచేలా ఓ వ్యక్తి వ్యాఖ్యలు చేశారంటూ టీడీపీ శ్రేణుల ఆధ్వర్యంలో ప్రారంభమైన ఆందోళనలు రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతున్నాయి. ఆ పార్టీతో కూటమిగా ఉన్న బీజేపీ, జనసేన శ్రేణులు కూడా ఈ ఆందోళనల్లో పాల్గొని, సాక్షి కార్యాలయాలపై మూకుమ్మడి దాడులకు పాల్పడి, ఆస్తులకు నష్టం కలిగిస్తున్నాయి. ఈ క్రమంలో రాజానగరంలోని సాక్షి ముద్రణా కార్యాలయం వద్ద కూడా కూటమి నేతలు ఆదివారం నుంచి ఆందోళనలు చేస్తున్నారు. మంగళవారం అవి మరింత పరాకాష్ఠకు చేరాయి. ఆందోళనకారుల దుర్మార్గ చర్యలను నిరోధించేందుకు ప్రయత్నించిన పోలీసులు కూడా గాయపడ్డారంటే వారి చేష్టలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

ఏం జరిగిందంటే..

రాజానగరం, అనపర్తి ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ (జనసేన), నల్లమిల్లి రామకృష్ణారెడ్డి(బీజేపీ)తో పాటు అనపర్తి టీడీపీ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి, జనసేన పార్టీ సమన్వయకర్త రావాడ నాగుల ఆధ్వర్యాన రెండు నియోజకవర్గాల నుంచి ఆ పార్టీల నాయకులు, కార్యకర్తలు సాక్షి ముద్రణా కార్యాలయం వద్దకు భారీగా తరలివచ్చి, ఆందోళనకు దిగారు. ఉదయం 10.30 గంటల సమయంలో రాజానగరం ఎమ్మెల్యే తన అనుయాయులతో కలసి ఆందోళన చేపట్టారు. సాక్షి మీడియాకు, వైఎస్సార్ సీపీకి, పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం కొద్దిసేపటికి తన వర్గీయులతో అక్కడకు చేరుకున్న అనపర్తి ఎమ్మెల్యే ఆ ఆందోళనను కొనసాగిస్తూ విధ్వంసం దిశగా నడిపించారు. కార్యాలయం ప్రధాన గేటు ముందు సాక్షి దినపత్రికలను వేసి దహనం చేశారు. పోలీసులు వారించినప్పటికీ ఆందోళనకారులు ఆగలేదు.

దౌర్జన్యం

ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ప్రోత్సాహంతో అనపర్తి నియోజకవర్గానికి చెందిన టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, కొప్పవరం మాజీ సర్పంచ్ కర్రి వెంకట రామారెడ్డి మరింత రెచ్చిపోయారు. పార్టీ శ్రేణులను ఉసిగొల్పారు. దీంతో, అన్నవరం దేవస్థానం మాజీ డైరెక్టర్ సత్తి దేవానందరెడ్డి (బాబు), రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి పుట్ట గంగాధర్ చౌదరి, టీడీపీ మహిళా అధ్యక్షురాలు జుత్తుగ సూర్యకుమారి, ప్రధాన కార్యదర్శి సువాసిని, బిక్కవోలు యూత్ కమిటీ అధ్యక్షుడు పాలచర్ల వెంకట శివ ప్రసాద్ చౌదరితో పాటు కొంతమంది మహిళా కార్యకర్తలు కార్యాలయం ప్రహరీకి అమర్చి ఉన్న సాక్షి నేమ్ బోర్డును బలవంతంగా పెకలించారు. అడ్డుకోబోయిన పోలీసులను ఖాతరు చేయలేదు. ఈ క్రమంలో రాజానగరం సీఐ ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్, ఎస్సైలు నాగార్జున, నారాయణమ్మతో పాటు కొంతమంది పోలీసుల చేతులకు కూడా గాయాలయ్యాయి.

రక్షణ కల్పించండి

సాక్షి ముద్రణా కార్యాలయంపై దాడి నేపథ్యంలో బ్రాంచి మేనేజర్ ఎస్.రమేష్‌రెడ్డి, సిబ్బంది కలసి సాయంత్రం సీఐ వీరయ్యగౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ దాడి కారణంగా జరిగిన నష్టాన్ని వివరిస్తూనే, ఇవి ఏ స్థాయికి వెళ్తాయోనని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రశాంత పరిస్థితులు నెలకొనేంత వరకూ కార్యాలయం వద్ద అవసరమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, తాము విధులు సక్రమంగా నిర్వర్తించేలా రక్షణ కల్పించాలని కోరారు.


రాజానగరం సీఐ వీరయ్యగౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సాక్షి సిబ్బంది


సాక్షి నేమ్‌బోర్డ్ పెకలిస్తున్న మహిళలు


ధ్వంసమైన సాక్షి నేమ్‌బోర్డ్

సాక్షి కార్యాలయాలపై దాడులు అమానుషం

- బాధ్యులపై చర్యలు తీసుకోవాలి
- జిల్లా ఎస్పీకి జర్నలిస్టుల విజ్ఞప్తి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా సాక్షి కార్యాలయాలపై అరాచక దాడులు చేస్తున్న టీడీపీ కుట్రపూరిత చర్యలపై జిల్లావ్యాప్తంగా జర్నలిస్టులు కదం తొక్కారు. రాజమహేంద్రవరం సాక్షి జర్నలిస్టులు, సాక్షి యూనిట్, ఇతర పాత్రికేయులు జిల్లా ఎస్పీ డి.నరసింహ కిశోర్‌ను కలిసి మంగళవారం వినతిపత్రం సమర్పించారు. సాక్షి టీవీలో అమరావతి రాజధాని అంశంపై జరిగిన చర్చకు సంబంధించి టీడీపీ, ఆ పార్టీలోని కొందరు వ్యక్తులు సాక్షి కార్యాలయాలపై రాళ్ల దాడులు చేపట్టి, బెదిరింపులకు పాల్పడుతున్నారని, దీనికి కారకులైన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఎస్పీకి విజ్ఞప్తి చేశారు. టీడీపీ ఆదేశాలతోనే సాక్షి కార్యాలయాలపై దాడులు జరుగుతున్నాయని, ఆ పార్టీ అధిష్ఠానం కుట్రపూరితంగా తన శ్రేణులను రెచ్చగొట్టి సాక్షిపై దాడులకు ఉసిగొల్పుతోందని అన్నారు. గుంపులుగా చేరి దాడులు చేసిన వారిపై 143, 147, 427, 341, 506, 352 సెక్షన్ల కింద కేసులు నమోదు చేయాలని కోరారు. దీనిపై ఎస్పీ స్పందిస్తూ వెంటనే సాక్షి కార్యాలయం వద్ద బందోబస్తు ఏర్పాటు చేయాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. ఎస్పీని కలిసిన వారిలో సాక్షి స్టాఫ్ రిపోర్టర్ ఫయాజ్ బాషా, సాక్షి టీవీ రిపోర్టర్ హరీష్, ఎన్‌టీవీ శ్రీను, సాక్షి జర్నలిస్టులు శేఖర్‌రెడ్డి, విశ్వనాథం, పీఎస్ గంగాధర్, టీవీ కెమెరామెన్ మురళి, సర్క్యులేషన్ మేనేజర్ రాంబాబు, ఎస్ఆర్ సురేష్‌కుమార్, యాడ్స్ ప్రతినిధి పి.వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, కె.వెంకటేశ్వరరావు తదితరులున్నారు.


ఎస్పీకి వినతిపత్రం అందిస్తున్న రాజమహేంద్రవరం జర్నలిస్టులు

బాబు పాలనలో భద్రత కరవు

- వైఎస్సార్ సీపీ నేతలు విజయలక్ష్మి, జగ్గిరెడ్డి
- సేవ్ వుమెన్...సేవ్ ఆంధ్ర నినాదంతో పార్టీ మహిళల నిరసన
- అమలాపురంలో అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పణ
- కిలోమీటరు మేర నినాదాలతో సాగిన నిరసన ర్యాలీ


అమలాపురంలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ పరిశీలకురాలు విజయలక్ష్మి, జిల్లా పార్టీ అధ్యక్షుడు జగ్గిరెడ్డి, మహిళా నాయకులు


అమలాపురం మద్దాలవారిపేటలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా నాయకులు విజయలక్ష్మి తదితరులతో జగ్గిరెడ్డి

అమలాపురం టౌన్: చంద్రబాబు పాలనలో మహిళలు, బాలికలకు భద్రత కరవైందని అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, జిల్లా పార్టీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వంలో మహిళలు, బాలికలపై హత్యలు, అత్యాచారాలు అధికమయ్యాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అమలాపురం నియోజకవర్గ పార్టీ ఆధ్వర్యంలో సేవ్ వుమెన్...సేవ్ ఆంధ్ర నినాదంతో జిల్లా పార్టీకి చెందిన మహిళా నాయకులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు అమలాపురంలో మంగళవారం చేపట్టిన నిరసన కార్యక్రమంలో విజయలక్ష్మి, జగ్గిరెడ్డి మాట్లాడారు. తొలుత స్థానిక సూర్యనగర్‌లోని పార్టీ నేత దివంగత కుడుపూడి చిట్టబ్బాయి ఇంటి వద్ద నుంచి పార్టీ మహిళలతో ర్యాలీ ప్రారంభించారు. హైస్కూలు సెంటరు, గొల్లగూడెం, శ్రీరామపురం మీదుగా మద్దాలవారిపేటకు దాదాపు కిలోమీటరు మేర నిరసన ర్యాలీ నిర్వహించారు. మహిళలు, బాలికలకు రక్షణ ఇవ్వలేని చంద్రబాబు ప్రభుత్వం రాజీనామా చేయాలని ర్యాలీలో నినాదాలు చేశారు. పాదయాత్ర మద్దాలవారిపేట చేరుకున్నాక ఆ పేటలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి జక్కంపూడి విజయలక్ష్మి ఆధ్వర్యంలో పార్టీకి చెందిన జిల్లా మహిళలు వినతి పత్రం అందించారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు వద్దని, అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం అమలు కావాలని నినాదాలు చేశారు. రాష్ట్రంలోని మహిళలకు, బాలికలకు భద్రత, రక్షణ కల్పించాలని అంబేడ్కర్ విగ్రహాన్ని వేడుకున్నారు. అనంతరం విజయలక్ష్మి, జగ్గిరెడ్డి వేర్వేరుగా మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక ఈ ఏడాది కాలంలో మహిళలు, బాలికలపై 188 హత్యలు, అత్యాచారాలు జరిగాయని విజయలక్ష్మి ఆందోళన వ్యక్తం చేశారు. 15 కేసుల్లో మహిళలు, బాలికలు అత్యాచారాలతో పాటు హత్యలకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే పరిస్థితి కొనసాగితే కూటమి ప్రభుత్వం త్వరలోనే కుప్పకూలిపోవడం ఖాయమని ఆమె స్పష్టం చేశారు. జగ్గిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయలేక పోతోందన్నారు. ప్రజల నుంచి ఎదురవుతున్న నిరసనను డైవర్ట్ చేసేందుకు, అక్రమాలను ప్రశ్నిస్తున్న సాక్షి చానల్, పత్రికపై అక్రమ కేసులు పెడుతోందని అన్నారు. సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావును అక్రమంగా అరెస్ట్ చేశారని పేర్కొన్నారు. పి.గన్నవరం నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, అమలాపురం, మండపేట మున్సిపల్ చైర్‌పర్సన్లు రెడ్డి సత్య నాగేంద్రమణి, పతివాడ నూక దుర్గారాణి, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, రాష్ట్ర దృశ్య కళల అకాడమి మాజీ చైర్‌పర్సన్ కుడుపూడి సత్య శైలజ, జిల్లా పార్టీ మాజీ మహిళా అధ్యక్షురాలు కాశి ముని కుమారి, అమలాపురం, అల్లవరం, అయినవిల్లి ఎంపీపీలు కుడుపూడి భాగ్యలక్ష్మి, ఇళ్ల శేషగిరిరావు, మట్టపర్తి నాగ విజయలక్ష్మి, అల్లవరం జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, నియోజకవర్గంలోని పట్టణం, మండలాల పార్టీ అధ్యక్షులు సంసాని బులినాని, బద్రి బాబ్జి, కొనుకు బాపూజీ, గుత్తుల చిరంజీవి, పార్టీ అనుబంధ కమిటీల జిల్లా అధ్యక్షులు షేక్ అబ్దుల్ ఖాదర్, జాన గణేష్, చీకట్ల కిషోర్, తోరం గౌతమ్ రాజా, సూదా గణపతి, మున్సిపల్ కౌన్సిలర్లు నాగవరపు వెంకటేశ్వరరావు, దొమ్మేటి రాము, కొల్లాటి దుర్గాబాయి, యన్నాబత్తుల పద్మ, రాజీ గోపి, కట్టోజు సన్నయ్యదాసు, బండారు గోవిందు, పార్టీ నాయకులు వంటెద్దు వెంకన్నాయుడు, మెండు సురేష్‌బాబు, బండారు సత్యనారాయణ పాల్గొన్నారు. చంద్రబాబు పాలనలో మహిళలు, బాలికలు అత్యాచారాలకు గురవుతున్న నినాదాలతో ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

అమలాపురం రూరల్: డబుల్ సర్క్యూట్‌కు సంబంధించి పాడైన టవర్ మార్పు చేయడం కోసం బుధవారం ఉదయం 5 నుంచి సాయంత్రం 7 గంటల వరకు దశలవారీగా జిల్లాలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఆపరేషన్ ఎస్ఈ సిద్దెల రాజబాబు తెలిపారు. 132/33కేవీ అమలాపురం, కొత్తపేట, రాజోలు, ముమ్మిడివరం పరిధిలోఉన్న ఐ.పోలవరం, ముమ్మిడివరం, కాట్రేనికోన, ఉప్పలగుప్తం, అమలాపురం మున్సిపాలిటీ, అమలాపురం రూరల్, అల్లవరం, అయినవల్లి, అంబాజీపేట, రాజోలు, మామిడికుదురు, పి.గన్నవరం, మలికిపురం, సఖినేటిపల్లి, కొత్తపేట, రావులపాలెం మండలాలకు దశలవారీగా విద్యుత్ అంతరాయం ఉంటుందని చెప్పారు.

బీవీసీ అక్షర్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రారంభం


ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌ను శాలువాతో సత్కరిస్తున్న బోనం కనకయ్య, పాండురంగ

అల్లవరం: మండలంలోని కోదూరుపాడు పంచాయతీ పరిధిలోని గుడ్డివానిచింత వద్ద బీవీసీ అక్షర్, బండి గుప్తాపు పాండురంగ సంయుక్తంగా నిర్మించిన ఇంటర్నేషనల్ స్కూల్‌ని సోమవారం బీవీసీ అధినేత బోనం కనకయ్య, ప్రారంభించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో తొలిసారిగా అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన బీవీసీ అక్షర్ స్కూల్‌ను ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ జక్కంపూడి కిరణ్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీను, గొవ్వాల రాజేష్, దొమ్మేటి రాము, సందర్శించి బీవీసీ అక్షర్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులను శాలువాలతో సత్కరించారు. బీవీసీ చైర్మన్ బోనం సతీష్, మెట్ల రమణబాబు, దాసం రాంబాబు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సముద్రంలో మునిగి యువకుడి మృతి

గల్లంతైన మరొకరి కోసం గాలింపు


హరికిషోర్ (ఫైల్)


హరికిషోర్ మృతదేహాన్ని వెలికి తీసిన ఎస్సై, సిబ్బంది

ఉప్పలగుప్తం: మండలంలోని ఎస్.యానం గ్రామంలో ఉన్న బీచ్‌లో స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగి ఇద్దరు యువకులు గల్లంతుకాగా అందులో ఒకరు మృతిచెందారు. మంగళవారం సాయంత్రం అంబాజీపేట మండలం మాచవరానికి చెందిన యాళ్ల హరికిషోర్(19), అయినవిల్లి మండలం నేదునూరుకి చెందిన ఇసుకపట్ల జస్వంత్(19), మరో ముగ్గురు నేదునూరుకు చెందిన యువకులు ఎస్.యానం బీచ్‌కు వచ్చి స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగారు. వీరు ఐదుగురు స్నేహితులు. సముద్రంలో స్నానానికి దిగిన ఐదుగురు యువకుల్లో హరి కిషోర్, జస్వంత్ సముద్రంలో మునిగిపోయారు. గల్లంతైన యువకుల కోసం గాలింపు చర్యలు చేపట్టగా హరికిషోర్ మృతదేహం లభ్యమయిందని, జస్వంత్ కోసం గాలిస్తున్నట్టు ఎస్ఐ సీహెచ్.రాజేష్ తెలిపారు.

కుటుంబాన్ని ఆదుకుంటాడనుకున్నాం...

అంబాజీపేట: మృతిచెందిన యాళ్ల హరికిషోర్ ఓ ప్రైవేటు కంపెనీలో రికవరీ ఏజెంటుగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతని మృతితో ఆ కుటుంబం శోకసముద్రంలో మునిగిపోయింది. కుటుంబాన్ని ఆదుకుంటాడనుకున్న నేపథ్యంలో ఇప్పుడు దిక్కెవరని బంధువులు, కుటుంబ సభ్యులు రోదిస్తున్న తీరు చూపరులకు కంటతడి పెట్టించింది. వీరి స్వగ్రామం పి.గన్నవరం కాగా మృతుడి తండ్రి కుమార్ ఎస్.యానం ఓఎన్‌జీసీలో పనిచేస్తున్నారు. తల్లి నాగమణి, అతని సోదరి మాచవరం కుసుమవారిపేటలో అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటున్నారు. అందరితో సరదగా ఉండే హరికిషోర్ ఇక లేడని తెలియడంతో కుసుమవారిపేటలో విషాదచ్ఛాయలు అలుముకున్నాయి. హరికిషోర్ అందరితో కలిసి ఉండేవాడని అతని మరణం జీర్ణించుకోలేకపోతున్నామని కుటుంబ సభ్యులు, బంధువులు రోదిస్తున్న తీరు చూపరులను కలచివేసింది.

పెండింగ్ లేకుండా సీఎస్ఆర్ నిధులు

అమలాపురం రూరల్: జిల్లాలో చమురు సహజ వాయువుల నిక్షేపాలను వెలికి తీసి తరలిస్తున్న చమురు సంస్థలు కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద కేటాయించే నిధులను పెండింగ్ లేకుండా అందించాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ చమురు సంస్థల ప్రతినిధులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ప్రజాప్రతినిధులు, చమురు సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి సీఎస్ఆర్ నిధులు వినియోగంపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ కొన్ని పనులకు నిధులు వెచ్చిస్తున్నారని మిగిలిన వాటిని పెండింగ్‌లో ఉంచుతున్నారని అలాకాకుండా ప్రతిపాదనలన్నింటికీ నిధులను కేటాయించాలని ఆదేశించారు. ఎమ్మెల్యేలు వేగుళ్ల జోగేశ్వరరావు, దాట్ల సుబ్బరాజు, బండారు సత్యానందరావు, దేవ వరప్రసాద్, ఓఎన్జీసీ, గెయిల్ ప్రతినిధులు రాజు రాంజీ, సునీల్ కుమార్, శాస్త్రి రామారావు పాల్గొన్నారు.

మెరుగ్గా పింఛన్లు, రేషన్ పంపిణీ : సామాజిక భద్రతా పింఛన్లు, రేషన్ పంపిణీ, దీపం 2, మూడు ఉచిత సిలిండర్ల పంపిణీ వంటి సేవల మెరుగ్గా అందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి మండల స్థాయి వరకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

భూ సమస్యలు పరిష్కరించాలి : ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలలో భూ సంబంధిత సమస్యలను పరిష్కరిస్తూ ప్రజా సంతృప్త స్థాయిలను మెరుగుపరచాలని కలెక్టర్ ఆదేశించారు. మంగళవారం అమరావతి నుంచి భూపరిపాలన ముఖ్య కమిషనర్ జయలక్ష్మి వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పీజీఆర్ఎస్ సమస్యల పరిష్కారంపై సమీక్షించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడారు.

ఎట్టకేలకు మాన్యువల్ కౌన్సెలింగ్‌కు ఆమోదం

రాయవరం: ఉపాధ్యాయుల ఒత్తిడికి ప్రభుత్వం తలొగ్గింది. వెబ్ కౌన్సెలింగ్ వద్దు..మాన్యువల్ కౌన్సెలింగ్ ముద్దు అంటూ ఉపాధ్యాయులు ఆందోళన బాట పట్టిన విషయం తెలిసిందే. ఎట్టకేలకు ప్రభుత్వం ఆమోదం తెలపడంతో మంగళవారం కాకినాడ సాలిపేట బాలికోన్నత పాఠశాలలో డీఈవో పి.రమేష్ ఆధ్వర్యంలో ఎస్‌జీటీల బదిలీ కౌన్సెలింగ్ ప్రారంభించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల పరిధిలోని మున్సిపాలిటీ, కార్పొరేషన్ పరిధిలోని ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్‌ను చేపట్టారు. ఎనిమిది అకడమిక్ సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసిన, రెండు సంవత్సరాల సర్వీస్ పైబడి బదిలీ కోరుకున్న ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. మున్సిపాలిటీల పరిధిలో 240 మంది, రాజమహేంద్రవరం, కాకినాడ కార్పొరేషన్ల పరిధిలోని 260 మంది ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు బదిలీ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో 406 మంది ఉపాధ్యాయులకు వివిధ కేటగిరీల్లో పదోన్నతులు లభించాయి.